క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టేకులగూడెం సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ప్రకాశ్‌రెడ్డి పేట, మైత్రివనం కాలనీ, లోటస్ కాలనీ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. గొర్రెకుంట, ఏనుమాముల, పోతన, పోచమ్మ మైదాన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కాశిబుగ్గ ఫీడర్‌లోని కాశిబుగ్గ, వివేకానంద కాలనీ, సాయిగణేశ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు యోగా దినోత్సవం

హన్మకొండ కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలకు హనుమకొండ వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొననున్నారు.

శిల్పాల ప్రాంగణంలో..

ఖిలా వరంగల్: త్రికోటలోని శిల్పాల ప్రాంగణంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా దినోత్సవానికి మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద హాజరవుతున్నారని పేర్కొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో..

కాజీపేట రూరల్: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కాజీపేట జంక్షన్‌లోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో శనివారం నిర్వహించనున్నట్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

'భద్రకాళి ధర్మకర్తల' ప్రమాణ స్వీకారం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయానికి నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరుగుతుందని ఆలయ ఈఓ శేషుభారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటకు చెందిన కత్తెరపల్లి హరీష్ (39) ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మృతుడి బాల్యమిత్రులు శుక్రవారం పరామర్శించారు. అండగా తాము న్నామంటూ బాధితులకు భరోసా కల్పిస్తూ, రూ.33 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శారద విద్యానికేతన్ 2001లో పదో తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ ఎస్సీకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి ఇర్ఫాన్ పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చుంచుకాల లింగారావు, జమీల బేగం, ఏఎన్ఎం కోమల, ఆశ వర్కర్లు సునీత, రమ, జయ, శ్రీవాణి పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.137.74 కోట్లు జమ

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాకు చెందిన రైతుల ఖాతాల్లో మూడో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 13 మండలాలకు చెందిన 1,48,581 మంది రైతులకు రూ.137.74 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

డిజిటల్ చెల్లింపులను అనుమతించాలి

ఖిలా వరంగల్: పోస్టాఫీసుల్లో డిజిటల్ చెల్లింపులు అమలు చేయాలని అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉజ్వల నాయకత్వంలో డిజిటల్ ఇండియా కార్యక్రమం ఎంతగానో అభివృద్ధి చెందిందని, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తూ, పారదర్శకత, వేగం, ప్రజల సౌకర్యార్థం రెట్టింపు డిజిటల్ సేవలు అందించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన పోస్టాఫీసుల్లో ఇప్పటికీ రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, అంతర్జాతీయ పోస్టల్ చెల్లింపులకు డిజిటల్ చెల్లింపు సదుపాయం లేదని ఆయన తెలిపారు.

డీజిల్ కాలనీలో సమస్యల తిష్ట



రైల్వే ఆలయానికి వెళ్లే మార్గంలో గుంతలు



రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు, చెట్లు



డ్రెయినేజీని కమ్మేసిన పిచ్చిమొక్కలు

- గుంతలమయమైన అంతర్గత రోడ్లు
- ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్‌కాలనీలో ప్రజలు, రైల్వే కార్మికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న డీజిల్ లోకోషెడ్, డీజిల్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో డీజిల్ లోకోషెడ్‌కు విధులకు వెళ్లే కార్మికులు, డీజిల్‌కాలనీ రైల్వే ఆస్పత్రికి వెళ్లే వారు, డీజిల్‌కాలనీ క్వార్టర్స్‌లో నివాసం ఉండే ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

అధ్వానంగా కాలనీ రోడ్లు

డీజిల్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో ఇరువైపులా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దాంతో విష పురుగుల బెడదతో క్వార్టర్స్‌లలో నివాసముండే వారు భయాందోళనకు గురవుతున్నారు. డీజిల్ కాలనీలో చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. దాంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని రైల్వే కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి



డీజిల్‌కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలి. డీజిల్ లోకోషెడ్, రైల్వే ఆస్పత్రికి వెళ్లే దారి, రైల్వే టెంపుల్‌కు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే మార్గంలో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. విష పురుగుల బెడద అధికమైంది.

\- పాలిమెర గోపి, స్థానికుడు

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు నిర్మలాగీతాంబ, పట్టాభి రామారావు తదితరులు



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

- న్యాయమూర్తి నిర్మలాగీతాంబ

వరంగల్ లీగల్: ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల శారీరక ఉత్తేజంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో యోగా మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నిర్మలా గీతాంబతో పాటు హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు శోభ బృందం ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగాసనాలు వేసి, శ్వాస పద్ధతులు నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమాదేశ్ పాండే, న్యాయమూర్తులు, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, జనరల్ సెక్రటరీ రమాకాంత్, వైస్ ప్రెసిడెంట్ మైదం జయపాల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

కేయూ క్యాంపస్: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలను యోగా గురువు శ్రీనివాస్ శుక్రవారం చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆమె అన్నారు. వివిధ యోగాసనాలతో కలిగే ఉపయోగాలను యోగా సాధకులకు శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీలత, డాక్టర్ చందర్, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను కేంద్రం నిలిపివేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్

హసన్‌పర్తి: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను కేంద్రం వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని శుభమస్తు గార్డెన్‌లో మున్సిపల్ కార్మికుల మండల సమావేశం శుక్రవారం జరిగింది. బొంగు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాగుల రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సూచించారు. గత కార్మిక చట్టాల రద్దు వల్ల కార్మికుల పనివేళలు 8గంటల నుంచి 10గంటలు పెరినట్లు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. జులై 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి పుల్లా అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు సందెల భిక్షపతి, రాజు, సందీప్, దేవమ్మ, సునీత, రజిత, మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాగుల రమేష్

దివ్యాంగుల సెల్ కోఆర్డినేటర్‌గా శ్రీధర్‌కుమార్ లోథ్



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) ఎకనామిక్స్ విభాగం అధిపతి డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్‌ను దివ్యాంగుల సెల్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఉత్తర్వులు అందజేశారు.

ఆర్ట్స్ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్



చెత్తను తొలగిస్తున్న ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కేడెట్లు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ ఎయిర్ వింగ్, ఆర్మీ మహిళా విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం ఎదుట శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, ఆఫీసర్ కేడెట్ డాక్టర్ నహిదా పర్వీన్, అధ్యాపకులు డాక్టర్ సురేష్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రమేష్, డాక్టర్ గిరి పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో మట్టి తొలగింపు



డ్రెయినేజీలోని మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

కాజీపేట: భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, మట్టిని తొలగిస్తున్నట్లు కార్పొరేటర్ విజయశ్రీ తెలిపారు. కాజీపేట 63వ డివిజన్ పలు కాలనీల్లో మురుగునీటి కాల్వలను పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం శుభ్రం చేశారు.

పెన్షనర్ల సంక్షేమానికి కృషి

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్‌షెడ్ రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాజీపేట పెన్షనర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ ప్రెసిడెంట్ పి.కృష్ణమూర్తి అన్నారు. డీజిల్ కాలనీ ఎంట్రెన్స్ సమీపంలో శుక్రవారం రాత్రి డీజిల్‌షెడ్ రైల్వే పెన్షనర్లు పి.సమ్మయ్య, జి.వెంకట నారాయణ జన్మదిన వేడుకల కార్యక్రమంలో కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. అనంతరం సుమారు పెన్షనర్లకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీజిల్‌షెడ్ రైల్వే పెన్షనర్స్ ప్రెసిడెంట్ ఎస్.రామస్వామి, సెక్రటరీ జి.మేఘనాథ్, ట్రెజరర్ ఎస్.నర్సయ్య, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీ.. విద్యార్థి మృతి

కాజీపేట రూరల్: రైలు ఢీకొని విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లెంకలపల్లికి చెందిన బోయిని నాగరాజు (22) బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీటెక్ చదువుతూ హనుమకొండ కుమార్‌పల్లిలో అద్దెకు ఉంటున్నాడు. కాజీపేట - హసన్‌పర్తి మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు ఢీకొని చనిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

'రెడ్డి పాలకవర్గం' ఏర్పాటు చేయాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పూర్తిస్థాయి పాలకవర్గం ఏర్పాటుతో పాటు రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడగానే మంత్రివర్గంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేసిందన్నారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అయినప్పటికీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు, పాలకవర్గం ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జుల కిషన్‌రెడ్డి, నాయకులు కసిరెడ్డి శరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు శరీర దానం

ఎంజీఎం: నగరంలోని తిమ్మాపూర్ బృందావన్ కాలనీవాసి దాచేపల్లి నరేందర్ (75) అనారోగ్య సమస్యతో మరణించారు. మృతుడి కూతురు దాచేపల్లి రజిని.. సమాజ హితం కోరి, వైద్య విద్య నిమిత్తం మెడికల్ కళాశాలలకు తన తండ్రి శరీరాన్ని దానం చేసేందుకు అంగీకరించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో నరేందర్ మృతదేహాన్ని తరలించి కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించినట్లు అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం శరీర దానం.. వందలాది మంది భావి వైద్యుల వైద్యవిద్యకు ఉపయోగపడుతుందని తెలిపారు. దాతలు 87905 48706, 94901 33650 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కేదారి, కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్ రెడ్డి, అనాటమీ సిబ్బంది ప్రేమ్‌కుమార్, యాదగిరి, ప్రణయ్, మృతుడి బంధుమిత్రులు రజిని, దాచపల్లి జయప్రకాశ్, సిరికొండ మౌనిక, చారి పాల్గొన్నారు.



నరేందర్ మృతదేహాన్ని అప్పగిస్తున్న అసోసియేషన్ సభ్యులు, మృతుడి బంధువులు

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని కాపువాడలో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రజల మెరుగైన జీవనోపాధి కోసం అవసరమైన వాతావరణాన్ని కల్పించాలన్న సంకల్పంతో రేవంత్‌రెడ్డి సర్కార్ ముందుకు సాగుతోందన్నారు. స్థానికుల సహకారం, అధికారుల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం కాలనీలో పర్యటించి డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ 10వ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి

కేయూలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సీఆర్‌పీఎఫ్‌నకు కేటాయించిన స్థలంలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన కొంత స్థలం సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఆధీనంలో ఉండడం సరికాదని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్.. యూనివర్సిటీలో ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు రాకేష్, దీక్షిత్‌రెడ్డి, ప్రశాంత్, రఘు, రాజేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు నాయకుల పరామర్శ

హన్మకొండ: ఇటీవల కాలు గాయంతో ఆపరేషన్ చేయించుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని శుక్రవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



పల్లాను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకం



సదస్సులో మాట్లాడుతున్న అనితారెడ్డి

కాజీపేట: జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని గుర్తించి, కష్టపడి చదివితే భవిష్యత్ బంగారుమయమవుతుందని కేయూ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను యమడాల అనుకాంత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు చాణక్య, రాజకుమారి, రజిత, హెచ్ఎం వెంకటేశ్వర్లు, అలివేలు మంగ, ఎం.ఏ.బాసిత్, బందెల చందు, అజీజ్, స్వప్న, వీరేందర్, సంధ్య, భాగ్య, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జానుంచి కాపాడాలి



భూమిని పరిశీలిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి 3వ డివిజన్ పైడిపల్లిలోని సర్వే నంబర్ 264లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సంగీ ఎలేందర్ డిమాండ్ చేశారు. ఆ భూమిని శుక్రవారం సందర్శించి ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్ల పోరాటాల ఫలితంగా వరంగల్ తహసీల్దార్ ఆ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు కూడా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అందులో నిరుపేదలు గుడిసెలు వేసుకుని ఉంటున్నారని అన్నారు. గుడిసెవాసులను కొంతమంది రాజకీయ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. భూ కబ్జాదారులను వెంటనే కట్టడి చేయాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆరె రాజు, మస్కె సుధీర్, బెజ్జంకి యాకంబ్రచారి, రాచర్ల రాజేందర్, మంద నవీన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కేయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ కోరారు. ఈ మేరకు కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం ప్రాజెక్ట్ వర్క్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు సేకరించి తమ సహచర విద్యార్థులు, అధ్యాపకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రమణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సామాజిక పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధికారెడ్డి, సూపరింటెండెంట్ బొల్లెపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎఫ్రిమ్‌రాజ్, ఈసీఈ రెండో సంవత్సరం విద్యార్థులు సాయిసుధ, సీహెచ్. రక్షిత, శార్వాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్, అధ్యాపకులకు మొక్కలు అందజేస్తున్న విద్యార్థులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, కష్టపడి పనిచేస్తూ కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. భూ కబ్జాలు, బెదిరింపులు, గొడవల్లో తలదూర్చితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.